## సీఎం కేసీఆర్‌కు జ్ఞాపిక అందజేత



సీఎం కేసీఆర్‌కు మల్లికార్జునస్వామి ఆలయ చిత్రపటాన్ని అందజేస్తున్న గదరాజు చందు

చేర్యాల, అక్టోబర్ 16 : చేర్యాల నకాషీ కళాకారులు పెయింటింగ్ వేసిన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ చిత్రపటాన్ని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు సోమవారం జనగామలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌కు అందజేశారు.

**చేర్యాల రెవెన్యూ డివిజన్ ప్రకటనపై హర్షం..**

జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ చేర్యాల ప్రాంత ప్రజలు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారని తెలిపారు.

## ఎంపీటీసీ కనకయ్యకు ఎంపీ పరామర్శ



ఎంపీటీసీ కనకయ్యను పరామర్శిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, అక్టోబర్ 16 : అక్బర్‌పేట–భూంపల్లి మండలం చిట్టాపూర్ బీజేపీ ఎంపీటీసీ కనకయ్య తండ్రి బొల్లారం పోషయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దుబ్బాక ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాపని రామాగౌడ్‌ను ఎంపీ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన నాయకులు సతీశ్‌రెడ్డి, చిట్టాపూర్ సర్పంచ్ రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి, చింతల కృష్ణ, జీడిపల్లి రవి, పోలబోయిన నారాగౌడ్ తదితరులున్నారు.

## కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయం

దుబ్బాక, అక్టోబర్ 16 : దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ అక్బర్‌పేట–భూంపల్లి మండలాధ్యక్షుడు జీడిపల్లి రవి అన్నారు. సోమవారం మండలంలో చౌదర్‌పల్లి, ఎనగుర్తి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు కాలం చెల్లిందన్నారు. దుబ్బాక ప్రజలంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. దుబ్బాక అభివృద్ధి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కుమార్, శంకర్, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష ఓట్ల మెజార్టీయే లక్ష్యంగా పనిచేయాలి

**ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

మర్కూక్, అక్టోబర్ 16 : మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేలా.. సీఎం కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజార్టీయే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని ఎర్రవల్లి కల్యాణ మండపంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, పిట్ల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, రామచంద్రం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, లక్కాకుల నరేశ్, సంతోష్‌రెడ్డి, రాజిరెడ్డి, మహేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో యువత చేరిక..**

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 16 : పట్టణంలోని 13వ వార్డుకు చెందిన పలువురు యువకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. తాళ్ల నరేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులకు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్ సమీర్, బీఆర్ఎస్ నాయకులు గుంటుకు రాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో దేశానికే ఆదర్శం తెలంగాణ



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి

ములుగు, అక్టోబర్ 16 : అభివృద్ధిలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని, సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఏఎంసీ చైర్మన్ జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. సోమవారం ములుగులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. తొమ్మిదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని, వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌తో పోటీ పడే సత్తా కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నర్సంపల్లి అర్జున్‌గౌడ్, గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దబాల్ అంజన్‌గౌడ్, జడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సలీం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శంకర్, వెంకటేశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న డీబీఎఫ్ శంకర్

## పేదలకు బీమా కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం

మిరుదొడ్డి, అక్టోబర్ 16 : సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు కలిగిన పేదలకు బీమా సౌకర్యం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో తెల్లరేషన్ కార్డు ఉన్న పేదలకు 'కేసీఆర్ బీమా.. పేదలకు ధీమా' అనే పథకాన్ని ప్రవేశపెట్టడంతో సోమవారం సిద్దిపేటలో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావును డీబీఎఫ్ శంకర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ శంకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు.

# సీఎం కేసీఆర్ కృషితోనే గజ్వేల్ అభివృద్ధి



సమ్మేళనంలో మాట్లాడుతున్న యాదగిరి

గజ్వేల్, అక్టోబర్ 16 : సీఎం కేసీఆర్ కృషితోనే గజ్వేల్ అభివృద్ధి సాధ్యమైందని, రాబోయే రోజుల్లో కేసీఆర్ సహకారంతోనే తమ సమస్యలు పరిష్కారించుకుంటామని నాచారం ఆలయ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని, ఈ విషయాన్ని త్వరలో మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సమస్యలు పరిష్కరించుకోవడంతోపాటు తామంతా ఐక్యంగా ముందుకు సాగుతామన్నారు. ముదిరాజ్ కులస్తుల్లో చిచ్చు పెట్టేలా చూస్తున్న రాజకీయ పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీసీ కులాల్లో అత్యధికంగా తమకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సముచిత స్థానం కల్పించాలన్నారు. అన్నివర్గాలతోపాటు ముదిరాజ్‌లకు గజ్వేల్ పట్టణంలో రెండెకరాల విస్తీర్ణంలో ఫంక్షన్ హాల్ నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ముదిరాజ్ కులస్తులకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, రాజు, శ్రీరాం నర్సింహులు, రాగుల రాజు, రొట్టల శ్రీను, ఆంజనేయులు, అనిల్, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

## తొమ్మిది షెటర్ల కేటాయింపు

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 16 : మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షెటర్లు అద్దెకు తీసుకునేందుకు వేసిన టెండర్ బాక్స్‌ను సోమవారం కమిషనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు తెరిచారు. షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి ఇరువై షెటర్లు ఉండగా, ఇందులో తొమ్మిది షెటర్లకే అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. మొదటి, రెండో షెటర్ల అద్దెను అధికారులు రూ.8,250 నిర్ణయించగా అత్యధికంగా రూ.13,350 ప్రమీల దక్కించుకుంది. 2,3,4,5,9,10,12,14 షెటర్లకు సైతం మున్సిపల్ నిర్ణయించిన ధర కంటే అత్యధికంగా అద్దెను చెల్లించేవారికే కేటాయించినట్లు కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

అక్కన్నపేట, అక్టోబర్ 16 : మండలంలోని రామవరం గ్రామానికి చెందిన నిరుపేద కత్తుల మల్లవ్వ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయన్న, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.



కొమురవెల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గురువయ్యగౌడ్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్

# బీఆర్ఎస్‌లో చేరికల జోష్

**సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ముఖ్యనాయకులు**

చేర్యాల/కొమురవెల్లి, అక్టోబర్ 16 : కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. చేర్యాల ప్రాంత కాంగ్రెస్ ముఖ్యనాయకులు సోమవారం జనగామ ప్రజా ఆశీర్వాద సభలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో కలిసి సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పొన్నాల లక్ష్మయ్య ప్రధాన అనుచరులుగా ఉన్న డీసీసీ వైస్ ప్రెసిడెంట్ వకులాభరణం నర్సయ్య పంతులు, కొమురవెల్లి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుడిగె గురువయ్యగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగమల్ల శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీ సయ్యద్ ఇక్బాల్, కాంగ్రెస్ చేర్యాల మండల ఓబీసీ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, టౌన్ ఓబీసీ ప్రెసిడెంట్ కూరపాటి మధుసూదన్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ బలహీనపడడంతోపాటు కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నెలకొందని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సమయం లేకపోవడంతో ముఖ్యనాయకులుగా ఉన్న వీరు మాత్రమే సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. మరికొన్ని రోజుల్లో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాల నుంచి భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం.